సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 18.726 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 18.726 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,840
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,733
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,905
నవర (8 గ్రాములు)	రూ.47,240


వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0 /25.4

శుక్రవారం గాలిలో తేమ 77 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఎంపీ విజయసాయిరెడ్డి నేడు నెల్లూరుకు రాక



ఎంపీ విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ దక్షిణ ప్రాంత జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు వేణంబాక విజయసాయిరెడ్డి శనివారం నెల్లూరుకు రానున్నారు. ఉదయం 10.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు మాగుంట లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5.30 గంటలకు నెల్లూరు నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు వెళ్తారు.

పాల సేకరణ కేంద్రాలు లైసెన్సులు తీసుకోవాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని పాల సేకరణ కేంద్రాలు మార్చి 10 లోపు తప్పకుండా లైసెన్సులు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం 2023 ప్రకారం జిల్లాలో పాలు సేకరించే ప్రతి కేంద్రం లైసెన్సు తీసుకోవాలన్నారు. జిల్లాలో దాదాపుగా 420కి పైగా పాల సేకరణ కేంద్రాలు ఉంటాయని అధికారులు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఈ లైసెన్సుల జారీ ప్రక్రియ ఉంటుందన్నారు.

ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలలో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,627 మంది విద్యార్థులకు గాను, 2,415 మంది హాజరు కాగా 212 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నాయుడుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరు నగరంలోని జెనెక్స్, పీఆర్ ఆర్‌అండ్ వీఎస్ డిగ్రీ కళాశాలల్లో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

టూరిజం కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం: టూరిజం కళాశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం) కళాశాల నోడల్ అధికారి సంజీవ్‌రెడ్డి కోరారు. మండలంలోని గొలగమూడి వద్దనున్న ఆ కళాశాలలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీబీఏ (టూరిజం అండ్ ట్రావెల్) కోర్సులు ఉన్నా యని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 99664 62786, 9490787854 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలియజేశారు.

సెలవుపై వెళ్లిన కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఎం హరినారాయణన్ మూడురోజుల పాటు సెలవుపై వెళ్లారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వికా స్ మర్మత్ శనివారం నుంచి సోమవారం వరకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారు.

బత్తాయి రైతు ధరహాసం

సిట్రస్ జాతికి చెందిన బత్తాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎక్కువమంది బత్తాయి జ్యూస్ తాగేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో వాటి వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, ధరలు బాగా ఉండటంతో జిల్లాలో బత్తాయి రైతులు లాభాలు ఆశించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- ఆశాజనకంగా తోటలు
- జిల్లాలో 16 వేల హెక్టార్లలో సాగు
- మార్కెట్‌కు వస్తున్న కాయలు
- 41 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఉత్తరాది రాష్ట్రాలకూ ఎగుమతి

ఉదయగిరి: బత్తాయి సాగు చేస్తున్న రైతులకు ఈ ఏడాది కూడా లాభాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. తోటల్లో కాయ దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, మార్కెట్‌లో వాటికి మంచి ధర ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న బత్తాయి తోటల్లో కాయ పక్వానికి రావడానికి మరో నెల రోజులు పడుతుంది. వేసవి సీజన్ కావడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అక్కడక్కడ మార్కెట్‌కు కాయలు వస్తున్నాయి. ప్రస్తుతం టన్ను ధర రూ.50వేలకు పైనే ఉంది.

ఈ సీజన్‌లో బత్తాయి కాయలకు మంచి ధర ఉండటంతో సాగు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రైతులు అధికంగా బత్తాయి సాగు చేస్తారు. అందులో మన రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరులోనూ సాగు బాగానే ఉంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో దిగుబడులు ఎక్కువగా వచ్చి లాభాలు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ కాయలు కోత జరుగుతున్నప్పటికీ వచ్చే నెలలో కోతలు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 16 వేల హెక్టార్లలో బత్తాయి తోటలు ఉన్నాయి. వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం మండలాల్లోనే దాదాపు రెండు వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. వింజమూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి మండలాల్లో ఏడు వందల ఎకరాలలో తోటలు సాగులో ఉన్నాయి. ఆత్మకూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లోనూ వేలాది ఎకరాల్లో తోటలు సాగులో ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి వర్షాలు బాగా ఉండటంతో రైతులు ఏటా బత్తాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. దానికి తోడు ప్రభుత్వం కూడా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వడం, వివిధ రకాలుగా ప్రోత్సాహకాలు ఉండటంతో అనేక మంది రైతులు లేత తోటలు సాగు చేశారు. ఈ ఏడాది 41వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం అక్కడక్కడ కాపునకు వచ్చిన తోటల నుంచి రైతుల వద్ద వ్యాపారులు టన్ను రూ.50 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో ధర మరింత పలికే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాదితో ఈ సీజన్‌లో టన్ను రూ.25 వేలు మాత్రమే ఉంది. ఈ ఏడాది ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా తోటలు బాగున్నాయి



నా పేరు సయ్యద్ గౌస్‌మొయిద్దీన్. ఉదయగిరి మండలం దాసరిపల్లిలో 5 ఎకరాల బత్తాయి తోట ఉంది. చంద్రబాబు పాలనలో కరువు వచ్చి తోటలు ఎండిపోయాయి. మరలా జగనన్న పాలనలో వర్షాలు సమృద్ధిగా ఉండటంతో నాలుగేళ్లుగా చెట్లు జీవం పోసుకొని దిగుబడులు బాగా పెరిగాయి. గత వేసవిలో మంచి దిగుబడులు వచ్చి రూ.2 లక్షలు వరకు ఆదాయం వచ్చింది. ఈ సీజన్‌లో కూడా బాగా ఆదాయం వచ్చే అవకాశం కనిపిస్తోంది.



సాగులో ఉన్న బత్తాయి తోట





ఇటీవల సాగు చేసిన లేత బత్తాయి తోట

విదేశాలకు ఎగుమతి

గత ఏడాది మన జిల్లా నుంచి నాణ్యమైన బత్తాయి కాయలను అరబ్ దేశాలకు కూడా ఎగుమతి చేశారు. ఇక్కడ కోసిన కాయలను బెంగళూరు, ఢిల్లీ మార్కెట్‌లకు పంపుతారు. అక్కడ నుంచి నేపాల్, సింగపూర్, మలేసియా, బ్రిటన్, ఐర్లాండ్, అమెరికా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తారు. మన బత్తాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు తోటలు వద్దే ముందే అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ మంచి ధర పొందుతున్నారు. మన జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు 70 శాతం పైగా ఎగుమతి అవుతోంది.

వెలిగొండ జలాల రాకపై ఆశ



చంద్రబాబు పాలనలో వర్షాలు లేక వందలాది ఎకరాల తోటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వచ్చింది. మళ్లీ జగన్ పాలనలో వర్షాలు బాగా కురవడంతో కొత్త తోటలు వేశారు. ప్రస్తుతం తోటల్లో దిగుబడులు బాగా వస్తున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి వచ్చే సీజన్‌కు నీటి పారుదల చేస్తామని సీఎం జగన్ మోహన్‌రెడ్డి చెబుతున్నారు. అదే జరిగితే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి బత్తాయి రైతులకు ఇబ్బందులు తొలగుతాయి.

సుభాని, రైతు, ఉదయగిరి

ప్రోత్సాహకాలు ఇస్తున్నాం



జిల్లాలో బత్తాయి సాగు నాలుగేళ్ల నుంచి క్రమేణా పెరుగుతోంది. ధరలు కూడా గిట్టుబాటుగా ఉన్నాయి. ఈ ఏడాది 41,324 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులకు ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలకు ఏటా రూ.1.20 లక్షలు సబ్సిడీ రూపంలో ఇస్తున్నాం. ఇలా మూడేళ్లు అందజేస్తున్నాం. డ్రిప్ కూడా దరఖాస్తు చేసుకున్న 20 రోజులు లోపే మంజూరు చేస్తున్నాం.

– మద్దిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

గ్రూప్-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాజేంద్రన్, చిత్రంలో మున్సిపల్ కమిషనర్, డీఆర్వో తదితరులు

- పరీక్ష కేంద్రాల్లో అన్ని ముందస్తు చర్యలు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జేసీ రాజేంద్రన్
- జిల్లాలో 80 కేంద్రాల్లో ఈనెల 25న పరీక్ష
- హాజరుకానున్న 23,908 మంది అభ్యర్థులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 25న జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీయస్సీ) గ్రూప్-2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై రూట్ ఆఫీసర్లు, సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, డీఆర్ఓ లవన్న, ఏపీపీయస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబురావు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 23,908 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు మొదలగు అన్ని వసతులు తప్పనిసరిగా ఉండేలా ముందుగా పరిశీలించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలలో అనుమతించరాదన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, ఈ సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. విద్యార్థులు నిర్ణీత సమయాని కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు

గ్రూప్–2 పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల సందేహాల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే 0861–2331261 నెంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రూట్ ఆఫీసర్లు, సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒంగోలు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసిన జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తూమాటి మాధవరావు, కందుకూరు పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి

తీరానికి కొట్టుకువచ్చిన డాల్ఫిన్ ఫిష్ కళేబరం



డాల్ఫిన్ ఫిష్ కళేబరం

తోటపల్లిగూడూరు: కోడూరు సముద్ర తీరంలోని వెంకన్నపాళెం సమీపంలో శుక్రవారం ఓ డాల్ఫిన్ ఫిష్ కళేబరం కొట్టుకు వచ్చింది. స్థానికుల సమాచారంతో దుగరాజుపట్నం మెరైన్ సీఐ కిశోర్ కుమార్, ఫారెస్ట్ అధికారి మాల్యాద్రి కళేబరాన్ని పరిశీలించారు. సుమారు 50 కేజీల బరువున్న ఈ డాల్ఫిన్ ఫిష్ అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు. అధికారులు తీరంలోనే మట్టి తీసి పూడ్చి పెట్టారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండాలి

నెల్లూరు(సెంట్రల్): రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త వినీత పేర్కొన్నారు. నెల్లూరులోని పరిశోధనా స్థానంలో వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పంటలు ఎంతమేర సాగు చేశారు, ఎక్కడ తక్కువగా సాగైంది వివరాలు గుర్తించాలన్నారు. ప్రధానంగా వివిధ తెగుళ్ల, వాటికి విరుగుడుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు సరోజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శుక్రవారం నిర్వహించిన బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన ఐదవ, ఏడవ సెమిస్టర్ పరీక్షలకు 84 మంది, మధ్యాహ్నం నిర్వహించిన తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలకు 75 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ విజయానంద్ కుమార్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కాకర్ల వైపే టీడీపీ మొగ్గు!

- ఉదయగిరిలో కాకర్ల సురేష్‌కే టికెట్ ఖరారైనట్లు ప్రచారం
- టికెట్ ఆశిస్తున్న బొల్లినేని రామారావు అలక
- సీటు కోసం ఢిల్లీ పెద్దల ద్వారా చంద్రబాబుపై ఒత్తిడి
- బొల్లినేని సీటు విషయంలో ససేమిరా అంటున్న లోకేశ్
- ఎన్‌ఆర్‌ఐల ద్వారా భారీగా వసూలు చేసి లోకేశ్‌కు ఇచ్చిన కాకర్ల
- ఉదయగిరి టీడీపీలో ఆధిపత్య పోరు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: క్షేత్ర స్థాయిలో గెలుపు ధీమా లేని టీడీపీ అధిష్టానం ఈ దఫా దండిగా పార్టీ ఫండ్‌తో పాటు ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే వారికే టికెట్లు ఖరారు చేస్తోంది. డబ్బు సంచుల తూకంతోనే టికెట్ల కేటాయింపులు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. తాజాగా ఉదయగిరి నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఉదయగిరికి పరిచయం లేని కొత్తవ్యక్తి (ఎన్‌ఆర్‌ఐ) ఏడాది కాలంగా టీడీపీలో చేరి తెగ హడావుడి చేస్తున్నాడు. తమ తాతల కాలంలో మాది ఉదయగిరి ప్రాంతమని చెప్పుకుంటూ కాకర్ల సురేష్ అనే వ్యక్తి టీడీపీలో సీటు ఖరారు చేయించుకునే స్థాయికి వెళ్లాడని తెలుస్తోంది. స్థానికత లేదు. రాజకీయ కుటుంబం కాదు. కేవలం డబ్బు బలంతోనే మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును కాదని టికెట్ ఖరారు చేయించుకునే పరిస్థితి వరకు వచ్చాడని తెలుస్తోంది.

బొల్లినేనికి అవమానం

ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు ఆ పార్టీలోనే అవమానాలు జరుగుతున్నాయి. ఇతనికి మహారాష్ట్రలో పలుకుబడి ఉన్న కాంట్రాక్టర్‌గా ఢిల్లీ స్థాయిలో బీజేపీ పెద్దలతో లింకులున్నాయి. ఆ లింకులతోనే పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లకు ఉపయోగపడ్డాడు. ఢిల్లీ బీజేపీ పెద్దలతో ఏదైనా అత్యవసరం పనులుంటే బొల్లినేని ద్వారానే వ్యవహారం నడిపించుకునే వారు. దీంతో బొల్లినేని తనను కాదని ఉదయగిరి టీడీపీ సీటు ఎక్కడకు పోదన్న భావనతో ఉండేవాడు. కానీ టీడీపీ అధిష్టానం మాత్రం ఆయనను కేవలం బీజేపీ పెద్దలతో పనులు చేయించుకునే దళారిగానే భావించింది. అతని వద్ద పెద్దగా డబ్బు మూటలు లేకపోవడంతో అతని మాట పెద్దగా పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఎన్‌ఆర్‌ఐ నంటూ విదేశాల్లో భారీగా వసూళ్లు చేసి లోకేశ్‌కు ముడుపులు ఇచ్చిన కాకర్ల సురేష్‌కు సీటు ఖరారు అయినట్లుగా టీడీపీ అధిష్టానం నుంచి సంకేతం రావడంతో బొల్లినేని అలకబూనారు. ఢిల్లీ స్థాయి పెద్దల నుంచి కూడా చంద్రబాబుపై ఒత్తిడి పెంచినా లోకేశ్ ససేమిరా అన్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో బొల్లినేని వర్గీయులు లోకేశ్ తీరుపై మండిపడుతున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా ఉన్న మాకే వెన్నుపోటు పొడిచారంటూ భగ్గుమంటున్నారు. నిన్నమొన్నటి వరకు కాకర్ల సురేష్‌ను బొల్లినేని రామారావు దూరంగానే పెట్టాడు. యువగళం పాదయాత్రలో కాకర్ల సురేష్‌ను ఉదయగిరి దరిదాపుల్లోకి రానివ్వలేదు. కానీ కాకర్ల మాత్రం లోకేశ్‌తో సత్సంబంధాలు పెంచుకుంటూ ఎన్‌ఆర్‌ఐ కోటాలో సీటు కోసం కర్చీఫ్ వేశాడు. ఏడాదికాలంగా నియోజకవర్గంలో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నికల కోసం సేవా కార్యక్రమాల ద్వారా పథకం ప్రకారం ప్రచారం చేసుకున్నాడు. బొల్లినేని వర్గాన్ని కూడా డబ్బు సంచులతో కొనుగోలు చేసుకుంటూ వెళ్తున్నాడు. అనుకున్నట్లే లోకేశ్ వద్ద పరపతి పెంచుకుని చివరకు బొల్లినేనికి నామం పెట్టేలా చేశాడు. మరి బొల్లినేని వర్గం కాకర్లకు ఎంత మాత్రం పనిచేస్తుందో వేచిచూడాలి.



ఉదయగిరి టీడీపీ టికెట్ నాదే: బొల్లినేని

- కాకర్లకు ఇస్తే సహకరించేది లేదు

ఉదయగిరి: 'ఉదయగిరి టికెట్ నాదే. నియోజకవర్గంలో పార్టీని, క్యాడర్‌ను బతికించుకునేందుకు ఎంతో ఖర్చు చేశా. నన్ను కాదని వేరే వారికి టికెట్టు ఇచ్చే ప్రసక్తే లేదని' ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు తెగేసి చెప్పారు. ఉదయగిరి పార్టీ టికెట్టు కాకర్ల సురేష్‌కే వస్తుందని ప్రచారం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం బొల్లినేని ఉదయగిరిలో తన అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శవ పేటికలు అమ్ముకునే వ్యక్తి టికెట్టు వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారంటూ కాకర్ల సురేష్‌పై పరోక్షంగా ఫైర్ అయ్యారు. రెండ్రోజుల్లో చంద్రబాబును, లోకేశ్‌ను కలిసి టికెట్టు విషయమై తేల్చుకుని వస్తానని క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. సామాజిక సమీకరణాల గురించి బొల్లినేని మాట్లాడుతూ పరోక్షంగా బీసీలకు ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇస్తే సహించేది లేదన్నారు. వ్యూహాత్మకంగా అధిష్టానంపై ఒత్తిడి పెంచే యోచనలో భాగంగానే బొల్లినేని ఘాటు హెచ్చరికలు చేశారని ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. దీంతో ఉదయగిరి టీడీపీ క్యాడర్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. బొల్లినేని, కాకర్లలో ఎవరికి టికెట్టు ఇచ్చినా మరో వర్గం సహకరించే పరిస్థితి లేకపోవడంతో పార్టీకి తీవ్ర నష్టం తప్పదని టీడీపీ క్యాడర్ ఆందోళన చెందుతోంది.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు దక్షిణ కాలువలో పడి..

• ఇరిగేషన్ మజ్దూర్ మృతి

చేజర్ల: జలవనరుల శాఖలో సీనియర్ మెన్ మజ్దూర్‌గా పనిచేస్తున్న ఎస్‌కే మౌలాలి బాషా (62) సోమశిల దక్షిణ కాలువలో పడి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మౌలాలీకి వివాహమై ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జలవనరుల శాఖలో సోమశిల ప్రాజెక్టు కింద పొదలకూరు సబ్‌డివిజన్‌లో మెన్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా చేజర్ల మండలం బోడిపాడు సమీపంలో సోమశిల సౌత్ ఫీడర్ చానెల్ (సోమశిల దక్షిణ కాలువ) వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. ఆదూరుపల్లి – చేజర్ల మధ్యలో బోడిపాడు కాలువ బ్రిడ్జి వద్ద ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న చేజర్ల ఎస్సై ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లులు లేకుండా తరలిస్తుండగా..

• బంగారు ఆభరణాలు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు, నగదును నెల్లూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వారి కథనం మేరకు.. నగరంలోని పుత్తా ఎస్టేట్‌కు చెందిన కోటేశ్వరరావు బంగారు లైన్ బిజినెస్ చేస్తున్నాడు. అతను వ్యాపార నిమిత్తం రెండురోజుల క్రితం ఒంగోలుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అతని ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌లో 187 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.65 లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన బిల్లులు చూపలేదు. దీంతో తదుపరి విచారణ నిమిత్తం వాటిని శుక్రవారం జీఎస్టీ అధికారులకు అప్పగించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.25



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 156
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 136



పార్టీ కన్నా ఎవరూ బలవంతులు కాదు

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



3వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'సీఎం జగనన్న సామాన్య ముస్లిం వ్యక్తికి సిటీలో అవకాశం ఇచ్చారు. దీంతో అలిగి పదవులు ఇచ్చిన విషయం మర్చిపోయి పార్టీ మారడం సరికాదు. పార్టీ కన్నా ఎవరూ బలవంతులు కాదు' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్‌తో కలిసి అనిల్ శుక్రవారం నగరంలోని 3వ డివిజన్ వేణుగోపాల్ నగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయంలో ముస్లింలు కీలక పాత్ర పోషించారన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారన్నారు. వైఎస్సార్‌సీపీ పెట్టిన నాటి నుంచి పార్టీ కార్యకర్తగా, రెండుసార్లు కార్పొరేటర్‌గా, ప్రస్తుతం డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్ అహ్మద్‌ను సిటీ సమన్వయకర్తగా జగనన్న నియమించారన్నారు. బారాషహీద్ దర్గా ఉన్న నగరం మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు. సామాన్యుడైన ఖలీల్ అహ్మద్‌ను ఆశీర్వదించాలని కోరారు. తాను నెల్లూరును వీడి నరసారావుపేటకు వెళ్లిపోయానని, కార్యకర్తలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా పట్టించుకునే వారు లేరని ఓ టీడీపీ నాయకుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యకర్తల జోలికి వెళ్లాలంటే ముందు తనను దాటాలన్నారు. ఏమి చేసినా చెల్లుబాటవుతుందనే అపోహలకు స్వస్తి చెప్పాలని ప్రతిపక్షాలను హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

• జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సంతృప్త స్థాయిలో రైతులకు అందజేసినట్లు చెప్పారు. 25,600 మెట్రిక్ టన్నుల నాణ్యమైన ఎరువులను రైతులకు అందించామన్నారు. వ్యవసాయంతోపాటు పశుసంవర్ధకశాఖలో కూడా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి మనుషులతో పాటు పశువులకు కూడా అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్నదాతలందరూ ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని, ఈ విషయంపై జిల్లాలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి రైతులు నష్టపోకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత వ్యవసాయ, అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, మైక్రో ఇరిగేషన్, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖల అధికారులు, ఆయా శాఖల ద్వారా రైతుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వ్యవసాయ అధికారిణి సత్యవాణి వివరించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కృష్ణారెడ్డి, హార్టికల్చర్ బోర్డు మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎల్‌డీఎం టి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పథకాలు



మహిళకు రిజిస్ట్రేషన్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇందులో భాగంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. గృహ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న 580 మంది లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయన పట్టాలు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన నివేశన స్థలాలు, అసైన్‌మెంట్ భూములకు శాశ్వత భూ హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోని పేదలకు 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. అంతే కాకుండా వాటిపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, ఇలా గతంలో జరగలేదన్నారు. అప్పట్లో ఇళ్లు ఇచ్చినా హక్కులు మాత్రం ఉండేవి కాదన్నారు. ఎన్నో షరతులతో పట్టాలిచ్చేవారన్నారు. ప్రతి పేదవాడికీ స్థిరాస్తి ఉండాలని జగన్ ఈ చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం కూడా పేదల కోసం ఇన్ని రకాల పథకాలు ప్రవేశపెట్టిన దాఖలా లేవన్నారు. ముఖ్యమంత్రిగా జగనన్న ఉంటేనే ప్రజలంతా సంతోషాలతో ఉంటారని తెలిపారు. పేదలు బాగుండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని చెప్పారు. ఐదేళ్ల పాలనలోనే ఆయన ఎంతో చేశారని, మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకెంత చేస్తారో ఆలోచించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు రూపంలో ఆయన రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పదిమంది అసైన్డ్ లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు పట్టాలను ప్రసన్న పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్, బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు ఎం.రంగారెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు



వలంటీర్‌ను సన్మానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు నాయుడు అనేక హామీలిస్తున్నారని, ప్రజలు ఆయన్ను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జలదంకిలోని పద్మావతి కల్యాణ మండపంలో శుక్రవారం ఎంపీడీఓ రాజశేఖర్‌రావు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. 17 పంచాయతీలకు చెందిన వారికి ఆయన పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచారన్నారు. కరోనా సమయంలో వారు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, మళ్లీ రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాయమాటలు చెబుతున్నారని, వారిని నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు, సురె వెంకటశేషారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

కావలి: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. కావలిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది యువకులు సులువుగా డబ్బు సంపాదించేందుకు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి మత్తు పదార్థాలను తీసుకొచ్చి యువతకు అమ్ముతున్నారు. ముఠాలో సునాని రుగ్దార్, కుంభా ఉదయ్, దేవరకొండ నిఖిల్, షేక్ షాహిద్, వల్లెపు అభినయ్, పందిపట్ల దేవదానం, పల్లెబోయిన ఈశ్వర్‌సాయి, దుంపాల జాన్ వసంత్, మరో 17 ఏళ్ల యువకుడు తదితరులు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. రుగ్దార్ అనే వృద్ధుడిది ఒడిశా రాష్ట్రం. అతను ముసునూరులో మకాం పెట్టి యువకుల ద్వారా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తేలింది. ఇతను, పరారీలో ఉన్న ముగ్గురు కలిసి చేతి నరాలకు ఇంజక్షన్ ద్వారా ఎక్కించే మత్తు పదార్థాలను హైదరాబాద్ నుంచి తెస్తున్నారని డీఎస్పీ వెల్లడించారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పర్యవేక్షణలో కావలి వన్ టౌన్ సీఐ ఎం.రాజేష్, అతని బృందం నిఘా పెట్టి ముఠా గుట్టును రట్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

కొడుకు కళ్లెదుటే తల్లి దుర్మరణం

• స్వగ్రామానికి వెళ్తుండగా ఢీకొన్న కారు

• తల్లి మృతి, కుమారుడికి గాయాలు



షాహీనా మృతదేహం

నెల్లూరు రూరల్: తల్లీకొడుకు మోటార్‌బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొంది. దీంతో కుమారుడి కళ్లెదుటే తల్లి మృతిచెందింది. ఈ ఘటన రూరల్ పరిధిలోని నరుకూరు సమీపంలోని చిన్న చెరుకూరు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరుకు చెందిన షేక్ షాహీనా (38) తన కుమారుడు సిద్ధిఖ్‌తో కలిసి మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా వేగం తగ్గించింది. దీంతో బైక్ ట్రాక్టర్‌ను తప్పించి ముందుకు వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో తల్లీకొడుకు రోడ్డుపై పడ్డారు. షాహీనాకు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. సిద్ధిఖ్ గాయపడ్డాడు. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.